క్లుప్తంగా

సిద్దవటం కోర్టు ఏజీపీగా గాదె ఆదినారాయణ



ఒంటిమిట్ట : సిద్దవటం మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఏజీపీగా ఒంటిమిట్టకు చెందిన గాదె ఆదినారాయణ నియమితులయ్యారు. సిద్దవటం, కడప తదితర ప్రాంతాల కోర్టులో పన్నెండు సంవత్సరాలుగా న్యాయవాదిగా గుర్తింపు పొందారు. కాగా న్యాయవాదిగా చేస్తున్న సేవలను గుర్తించి తమకు ఏజీపీగా అవకాశం కల్పించిన వారందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష



పాలిసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాజంపేట : రాజంపేటలో బుధవారం పాలిసెట్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగాయి.స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అన్నమాచార్య యూనవర్సిటీలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కో–ఆర్డినేటర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా. వై.సుధాకర్ ఆధ్వర్యంలో ఇన్విజిలేటర్లు విద్యార్థులు హాల్‌టికెట్లు పరిశీలించారు. రోల్‌నెంబరు వారీగా గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టారు. ఈ పరీక్షకు మొత్తం 975 మంది హాజరుకావాల్సి ఉండగా, 892 మంది విద్యార్థులు హాజరయ్యారు. 82 మంది గైర్హాజరు అయ్యారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు బుధవారం ఉప సర్పంచ్ ఎస్.మహబూబ్‌బాషా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయనతో పాటు అసిస్టెంట్ పెంచల్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఆకేపాటి



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

పెనగలూరు : మండలంలోని కంబాలకుంట గ్రామానికి చెందిన కోడూరు రమణయ్య కుమారుడి వివాహ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట సర్పంచ్ గీతాల నరసింహారెడ్డి, గుడు మల్లికార్జున రెడ్డి, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, సర్పంచ్ మహేష్, యానాదయ్య తదితరులు ఉన్నారు.

మట్టిబొమ్మల తయారీపై శిక్షణ




తయారీపై శిక్షణ ఇస్తున్న జెవివి నేత

రాయచోటి అర్బన్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం శిబిరంలో మట్టిబొమ్మల తయారీపై పిల్లలకు శిక్షణను ఇస్తున్నట్లు జె.వి.వి నేత గోపాల్‌దాస్ రాజశేఖర్ అన్నారు. బుధవారం శిబిరంలో మట్టిబొమ్మల తయారీలో పాటించాల్సిన మెళకువలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో జెవివి నేతలు చక్రపాణి, బయారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేషారెడ్డి, శివప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీపీగా నల్లగొండు లక్ష్మీదేవి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండల ఇన్‌చార్జ్ ఎంపీపీగా నల్లగొండు లక్ష్మీదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు.అనారోగ్య సమస్యలతో ఒంటిమిట్ట మండల పరిషత్ అధ్యక్షురాలు అక్కి లక్ష్మీదేవి మూడు నెలలపాటు సెలవు పెట్టారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యక్షులు వన్‌గా ఉన్న నల్లగొండు లక్ష్మీదేవి ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని ఆమె పేర్కొన్నారు.

ముగిసిన భగవద్గీత పారాయణం



సుబ్బరామచంద్ర దంపతులను సన్మానిస్తున్న ఆలయ ప్రతినిధులు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామంలో వెలసిన శ్రీ భద్రావతి సమేత భావనారాయణ స్వామి, శ్రీ కోదండరామ స్వామి ఆలయాల ప్రతినిధుల వారి ఆధ్వర్యంలో జరిగిన శ్రీమద్ భగవద్గీత పారాయణం కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా శాంతానంద ఆశ్రమానికి చెందిన ఆధ్యాత్మిక గురువు గురు సేవానంద స్వామి, సుబ్బరామచంద్రులు శ్రీమద్ భగవద్గీత అమృత పఠనంపై గత మూడు రోజులుగా భక్తులకు వివరించారు. అనంతరం సుబ్బరామచంద్ర దంపతులను ఆలయ ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

మరుగునపడే లోపు వినియోగంలోకి వచ్చేనా?

- నిరుపయోగంగా లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డు కార్యాలయ భవనం

లక్కిరెడ్డిపల్లి : గతంలో అదొక నియోజకవర్గ కేంద్రం. సంవత్సరాల తరబడి అక్కడ మార్కెట్ యార్డు ఉన్నా పేరుకే తప్పా ఏ రోజు రైతులకు ఉపయోగపడింది లేదు. ఒక విధంగా చెప్పాలంటే మార్కెట్ యార్డు మందుబాబులకు అడ్డగానే మారిందనే చెప్పాలి. ఎంతోమంది మార్కెట్ యార్డు చైర్మన్‌లు మారినా లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డుకు మోక్షం మాత్రం కలగలేదు. లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాలకు సంబంధించి లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలోనే మార్కెట్ యార్డు ఉంది. అయితే మార్కెట్ యార్డును వినియోగంలోకి తీసుకురావడంలో అటు ప్రభుత్వాలు, అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాలకు సంబంధించి రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి రాయచోటి, కడప, మదనపల్లి లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇదే మార్కెట్ యార్డు పరిధిలో పశువుల సంత అటు గాలివీడులోను, ఇటు రామాపురంలోనూ ప్రతి శనివారం, శుక్రవారం రోజుల్లో బాగా జరుగుతుంది. దాదాపు లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డుకు అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్నా ఏనాడూ పశువులు సంతగానీ, రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధరలకు మార్కెట్ యార్డుకు తరలించడం గానీ ఇప్పటి వరకు జరిగింది లేదనే చెప్పాలి. మార్కెట్ యార్డు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో మార్కెట్ యార్డు కార్యాలయం తప్పా యార్డులో ఉన్న షెడ్లు మందు బాటిళ్లు, బీరు సీసాలతో నిండిపోయి దర్శనమిచ్చి శిథిలావస్థకు చేరుకున్నాయి. మార్కెట్ యార్డు పరిధిలో ఇప్పటికే ప్రభుత్వం మారితే ఆ ప్రభుత్వం వారు జేసీబీలు పెట్టి గ్రావెలును తరలించడం ఆనవాయితీగా జరుగుతూనే



అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రహరీ గోడ పనులు



నిరుపయోగంగా ఉన్న షెడ్లు

యార్డు సంపద అధికార పార్టీ నాయకుల జేబుల్లోకి చేరడం తప్ప యార్డును అభివృద్ధి చేయడానికి ఎవరూ పట్టించుకోకపోవడంతో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారింది. విద్యుత్ బిల్లులు మార్కెట్ యార్డు నిర్వహణ ఖర్చుల కిందనే భరించాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు మార్కెట్ యార్డుపైన ప్రత్యేక దృష్టి సారించి యార్డును వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. అక్కడున్న సిబ్బంది తూతూమంత్రంగా కార్యాలయానికి వచ్చామా వెళ్లామా అన్న చందంగా ఉన్నారే తప్ప యార్డుకు ఒరిగింది శూన్యం. ప్రస్తుత ప్రభుత్వం అయినా యార్డును వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు ఉపయోగపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన మహాభారత యజ్ఞం



దుర్యోధన వధ నాటకాన్ని తిలకిస్తున్న ప్రజలు

వీరబల్లి : మండలంలోని మట్లి గ్రామం తొగటపల్లి వద్ద ఉన్న శ్రీ కోదండరామాలయం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞం బుధవారంతో ముగిసింది. ప్రతిరోజూ మధ్యాహ్నం సీతా మహాలక్ష్మీచే హరికథ, రాత్రి మహాభారత నాటకాలతో భక్తులను అలరించారు. ఈ కార్యక్రమానికి మండల నలుమూలల నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుండి ప్రజలు విశేషంగా పాల్గొన్నారు. చివరిరోజు బుధవారం దుర్యోధన వధ నాటకం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం ద్రౌపతి దేవి అగ్నిగుండం ప్రవేశం నిర్వహించారు. అనంతరం అదేరోజు రాత్రి చెక్కభజనలు, శ్రీరాముని కల్యాణం హరికథ భక్తులను ఎంతగానో అలరించింది. పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

అంటరానితనాన్ని రూపుమాపుదాం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీటీ కృపావతి

రామాపురం : మండలంలో అంటరానితనాన్ని లేకుండా చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ కృపావతి అన్నారు. మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ అడపాలల మాలపల్లెలో గురువారం పౌరహక్కుల దినోత్సవం చేపట్టారు. మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడైనా కుల వివక్షతకు గురవుతున్నారా, అగ్రకులాల మీ పట్ల వివక్షత చూపుతుంటే ధైర్యంగా వచ్చి అధికారులు లేదా గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి నెల చివరి వారంలో మండలంలో దళిత గ్రామాలలో పౌరహక్కుల సమావేశం ఏర్పాటు చేసి గ్రామాలలో ఎక్కడైనా వివక్షతకు గురవుతున్నట్లుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలో పౌర హక్కులకు భంగం వాటిల్లకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివక్షతకు గురవుతున్నవారి పక్షాన ప్రభుత్వం ఉంటుందని ఆమె తెలియజేశారు. సమావేశంలో ఆర్ఐ సమద్‌ఖాన్, వీఆర్‌ఓలు వెంకటసుబ్బయ్య, రాధిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుస్తకాల పఠనంతో మేధశక్తి పెంపు



విద్యార్థులకు ఆటల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు క్రిష్ణ

సిద్దవటం : పుస్తక పఠనం వల్ల విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచడమే గాకుండా కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం ఎంతైనా ఉంటుందని సిద్దవటం గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం 28 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ప్రతి రోజు గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థులు చదువుకొని మేధాశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. అంతేగాకుండా వార్తాపత్రికలు, మ్యాగజైన్‌లు చదువుకొని రోజువారి విషయాలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు క్రిష్ణ విద్యార్థినీ, విద్యార్థులకు చెస్ గురించి, వివిధ రకాల ఆటల గురించి వివరించారు. అనంతర ఆయన పిల్లలతో క్యారమ్స్, చెస్ ఆటలను ఆడించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



వీరబల్లి: వరలక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీపీ, కార్యాలయ సిబ్బంది



సుండుపల్లి: జ్ఞాపికను అందజేస్తున్న ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు

వీరబల్లి : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వరలక్ష్మీ బుధవారం పదవీ విరమణ పొందారు. ఆమెకు మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సభను ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో వారు వరలక్ష్మీకి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

సుండుపల్లె : పోలీసు విభాగంలో నిరంతరం విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన సుండుపల్లె పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పూల లక్ష్మీనరసయ్యకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని ఎస్ఐ ముత్యల శ్రీనివాసులు నిర్వహించారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనరసయ్యను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుండుపల్లె పోలీస్ సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు. అలానే జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సన్మాన సభలో పూల లక్ష్మీనరసయ్యను సతీసమేతంగా జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకట్రాది దుశ్శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించి బహుమతులను అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వలంటీర్ సులేమాన్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం కొత్తపల్లెకు చెందిన సచివాలయ వలంటీర్ సులేమాన్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. బుధవారం సులేమాన్ కుటుంబాన్ని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. అతని మృతిపై సంతాపం తెలిపి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలానే పట్టణానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు అర్షద్ మెదడుకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నారు. ఆయన్ను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా నాజ్ హాల్ సమీపంలో పెయింట్ షాప్ ఓనర్ మహమ్మద్‌ఆలీ మృతిచెందాడు. మహమ్మద్ ఆలీ మృతదేహాన్ని శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అతని మృతి పట్ల సంతాపం తెలిపి, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్‌చైర్మన్ ఫయాజ్‌రెహమాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హరూన్‌బాషా, షబ్బీర్, రౌనక్, కొలిమి చాన్‌బాష, రియాజుర్‌రెహమాన్, పట్టణ అధ్యక్షుడు నవాజ్, నవరంగ్ నిస్సార్, అబుజర్, యూసుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన పీఏసీఎస్ ఉద్యోగులు



సూర్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : ఉమ్మడి కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు నూతన అధ్యక్షుడుగా నియమితుడైన ఎం.సూర్యనారాయణరెడ్డిని బుధవారం పీఏసీఎస్ ఉద్యోగులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక సహకార పరపతి సంఘాల అసోసియేషన్ నేతలు బద్వేలులోని గెస్ట్‌హౌస్‌లో సూర్యనారాయణ రెడ్డిని కలుసుకున్నారు. శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డిబాబు, కార్యదర్శి ఆంజనేయులు, రాష్ట్రనేతలు సాబ్‌జాన్, ఆంజనేయులురెడ్డి, అన్నమయ్య జిల్లా కన్వీనర్ జాఫర్‌వలీ, సీఈఓలు రామక్రిష్ణ, వీరభద్ర, లక్ష్మీనారాయణ, ఖాదర్‌వలీ, ప్రతాప్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక లోకం వర్ధిల్లాలి



రాయచోటి : ప్రపంచ కార్మిక దినోత్సవం పీడిత జాతికి మహోత్సవమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటిలో పత్రికలు విడుదల చేసిన ఒక ప్రకటనలో శ్రామికులు, కార్మికుల్లో మే డే కొత్త స్ఫూర్తిని రగిలించాలని శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. కార్మికుల్లో చైతన్యం వెల్లివిరియాలన్నారు. శ్రమ దోపిడీని అరికట్టేందుకు ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలన్నారు. జగన్ ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సంక్షేమానికి కృషి చేసిందన్నారు. ఈ సందర్భంగా కార్మిక, కర్షక, శ్రమ జీవుల లోకానికి శ్రీకాంత్ రెడ్డి మే డే శుభాకాంక్షలు తెలిపారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

రామాపురం : మండల కేంద్రంలో తలపెట్టిన మహాభారత యజ్ఞాన్ని గురువారం రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లె లక్ష్మీప్రసాద్ రెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఉష్ణోగ్రతను దృష్టిలో ఉంచుకొని ఇక్కడికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి నీటి సమస్య వడదెబ్బ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహాభారత యజ్ఞం జరుపు ప్రాంతాలలో వర్షాలు సమృద్ధిగా కురిసే పంటలు బాగా పండి ఆ ప్రాంతం సస్యశామలంగా ఉంటుందని చెప్పారు. ఆయనతోపాటు మహాభారత యజ్ఞ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో స్పందించిన రక్తదాత

చిట్వేలి : వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్న బాధితురాలికి ఓ పాజిటివ్ రక్తం కావాలని సమాచారం తెలుసుకొని తిరుపతిలో చదువుకుంటున్న చిట్వేలికి చెందిన బాలసుబ్రమణ్యం సాయి రక్తదానం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేటకు చెందిన ధనలక్ష్మి (60) మంగళవారం తిరుపతిలో వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్నారు. ఆమెకు త్వరగా ఓ పాజిటివ్ రక్తం కావాలని డాక్టర్లు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. రక్తం కావాలంటూ వ్యాధిగ్రస్తురాలి కుటుంబ సభ్యులు మానవత సంస్థ చిట్వేలి శాఖ అధ్యక్షులు కుంభగిరి మునిరావును సంప్రదించారు. సమాచారం తెలుసుకున్న మునిరావు కుమారుడు బాల సుబ్రమణ్యం సాయి బుధవారం హాస్పిటల్‌కు వెళ్లి రక్తదానం చేశాడు.

ఘనంగా పరుశురామస్వామి జయంతి

రాజంపేట రూరల్ : పరుశురామ స్వామి జయంతి వేడుకలను మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండల పరిధిలోని అత్తిరాల పుణ్యక్షేత్రంలో వెలసివున్న పరుశురామస్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు కార్యక్రమాలను శ్రీ త్రేతేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ భక్త సేవ మండలి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభశాస్త్రీ పర్యవేక్షణలో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పూజలలో పాల్గొన్న భక్తులకు, మహిళలకు పరుశురామ స్వామి చరిత్రను, విశిష్టతను వివరించారు. వేడుకలలో గిరి ప్రదక్షిణ భక్త సేవ మండలి ప్రతినిధులు ఎన్.సిద్ధలింగారెడ్డి, పోకల ప్రభాకర్, యూపీ రాయుడు, ఎం.నాగభూషణరాజు దంపతులు, పూల బాలాజీ, యు.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మాతృసంస్థకు వెళుతున్న అధికారికి సన్మానం



మురళీధర్‌ను సన్మానిస్తున్న విద్యాశాఖాధికారులు

రాయచోటి టౌన్ : సమగ్ర శిక్ష (ఎస్ఎస్)లో పని చేస్తూఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా ఫారిన్ సర్వీస్‌లో పని చేస్తూ 5 సంవత్సరాలు పూర్తి చేసుకొని తిరిగి తన మాతృసంస్థ అయిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు వెళుతున్న మురళీధర్‌ను డీఈఓ సుబ్రహ్మణ్యం ఘనంగా సన్మానించారు. బుధవారం రాత్రి అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ కె. శ్రీనివాసరాజు, జిల్లా సమ్మిళిత సెక్టోరియల్ అధికారి కె.జనార్దన్, సమగ్ర శిక్ష ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపురమ్మ దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి



శ్రీ కొత్తపురమ్మతల్లి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



భక్తులను ఆకట్టుకున్న చాందినీ బండ్లు

సంబేపల్లె : కొత్తపురమ్మ దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. మండల పరిధిలోని దుద్యాల గ్రామం పూజారివాండ్లపల్లె సమీపంలో వెలసిన శ్రీకొత్తపురమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, రాయసీమ విద్యాసంస్థల అధినేతలు కొండారెడ్డి, ఆల్ ఇండియా పంచాయతీ పరిషత్ సెక్రటరీ చిదంబరరెడ్డి, ఆనంద్ రెడ్డి, బసిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వి.వి.రమణారెడ్డి, వి.వి ప్రతాప్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డిలతో కలసి మాజీ ఎమ్మెల్యే కొత్తపురమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీధర్‌రెడ్డి, బాగ్యమ్మ, నాయకులు పిచ్చిరెడ్డి, రెడ్డికుమార్‌రెడ్డి ఆంజనేయులు తదితరలు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

శ్రీ కొత్తపురమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కుబడులు ఉన్న భక్తులు చాందినీ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో కొత్త పురమ్మ ఆలయం వద్ద జాతర వాతావరణం కనిపించింది.

'గుడి స్థలంపై ఏపీఎండీసీ స్పష్టత ఇవ్వాలి'



మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి గ్రామానికి చెందిన సర్వే నెంబరు కాటమ దేవుని గుడి స్థలం పరిహారం శ్మశాన స్థలంపై ఏపీఎండీసీ అధికారులు స్పష్టత ఇవ్వాలని బెరైటీస్ ఆధారిత ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు రామసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంగంపేట ఏపీఎండీసీ అవసరాలకు ఏడు సంవత్సరాల క్రితం కాపుపల్లి గ్రామంలో ఇంటి నెంబర్లు వేయడం జరిగిందన్నారు. కాటమ రాయుడు దేవుడు గుడి స్థలం కోర్టు కేసులో ఉన్నందున రెవెన్యూ వారు స్వాధీనం చేయకూడదని స్పష్టం చేశారన్నారు. అయితే సర్వే నెంబరు 8లో 72.77 ఎకరాల పశువుల మేత బీడు కాటమ దేవుడి గుడిస్థలం శ్మశాన స్థలం ఉండగా ప్రస్తుతం ఆ స్థలంలో ఏపీఎండీసీ చట్ట వ్యతిరేకంగా అనుమతులు లేకుండా వృథా మట్టి నిల్వలు చేయడం జరిగిందని ఆరోపించారు. ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని, పశువులు మేత బీడు స్థలం శ్మశాన స్థల కాటమ దేవుడి గుడి పరిహారం విషయంలో ఇప్పటి వరకు ఏపీఎండీసీ అధికారులు ఎటువంటి సమాచారాన్ని ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏపీఎండీసీ అధికారులు స్పందించి ఈ విషయం స్పష్టత ఇవ్వని పక్షంలో దశలవారీ చట్టపరమైన కార్యక్రమాలకు సిద్ధమవుతామని వారు స్పష్టం చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పాఠశాల కరస్పాండెంట్ జి.వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

సిద్దవటం : పూర్వపు విద్యార్థులు అపూర్వ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషకరమని పూర్వపు ఎస్‌కేఆర్ నగర్‌లోని జీవీఎస్ ఓరియంట్(ఎయిడెడ్) హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి. అబ్బయ్య, కరస్పాండెంట్ గంజి వెంకటసుబ్బయ్యలు తెలిపారు. సిద్దవటం మండలం మాధవరం–1లోని జీవీఎస్ ఓరియంటల్ (ఎయిడెడ్) హైస్కూల్‌లో బుధవారం 1995 బ్యాచ్‌లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూర్వపు ఉపాధ్యాయులు, విద్యార్థులు మృతి చెందిన వారికి మొదటగా ఘనంగా నివాళులు అర్పించారు. తరువాత పూర్వపు విద్యార్థులు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించి వారు, వారి పిల్లల స్థితిగతులను వివరించారు. అనంతరం పూర్వపు ప్రధానోపాధ్యాయుడు జి. అబ్బయ్య మాట్లాడుతూ పూర్వపు విద్యార్థుల కలయిక ఒక పండుగలాంటిదన్నారు. అనంతరం పూర్వపు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

ప్రజా కవి శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) మహాకవి అని తెలుగు భాషా సంరక్షణ సమితి ప్రతినిధులు గంగనపల్లి వెంకటరమణ, బొట్టు రామచంద్రనాయుడు, బీవీ నారాయణరాజు తెలిపారు. స్థానిక సరస్వతి విద్యామందిరం పాఠశాలలో బుధవారం శ్రీశ్రీ 116వ జయంతి వేడుకలను సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశ్రీ ప్రజాకవిగా, అభ్యుదయ సాహిత్య రథసారధిగా, ఆంధ్ర సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవితా మహాప్రస్థాన యుగకర్తగా పేరు గడించారని తెలిపారు. అంతకుముందు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థ గౌరవాధ్యక్షులు తుంగా వెంకటరమణారెడ్డి, ప్రియాంక, జాగృతి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన పెరగాలి

రాయచోటి జగదాంబసెంటర్ : స్వచ్ఛంద సంస్థలతో 2024–25 కాలంలో ఎయిడ్స్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన పెరగాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి అలీ హైదర్ తెలిపారు. బుధవారం రాయచోటిలో హైరిస్క్ గ్రూప్ పాపులేషన్ సర్వేపై సిబ్బందికి శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా హైరిస్క్ గ్రూప్ పాపులేషన్ సంబంధించిన హాట్ స్పాట్ గుర్తించి తప్పిదాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర అధికారుల సమన్వయంతో పనిచేయాలని మీ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని లేకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఏఈఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంధ సంస్థల ప్రాజెక్ట్ డైరెక్టర్లు, మేనేజర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది, పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం : మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీలలోని ఎస్సీ సంక్షేమ శాఖ 2025–26 ఆర్థిక సంవత్సరానికి 3 యూనిట్లు మంజూరైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అబ్దుల్ రహీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 3 (ప్యాసింజర్ ఆటో) వాహనాలకు బ్యాంకు రుణం రూ.1.85లక్షలు, ప్రభుత్వం నుంచి రూ.1లక్ష, లబ్ధిదారుడు కాంట్రిబ్యూషన్ రూ.15వేలు మొత్తం రూ.3లక్షలు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఓబీఎమ్‌డబ్ల్యూఎమ్‌ఎస్ పోర్టల్‌లో ధృవీకరణ పత్రాలతో ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాయలసీమ గ్రామీణ బ్యాంకు 1 యూనిట్, ఎస్‌బీఐ 1 యూనిట్, యూనియన్ బ్యాంక్ 1యూనిట్ మంజూరు చేసినట్లు చెప్పారు.